

సమస్యల సత్వర పరిష్కారం

గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పరిపాలనను ప్రజలకు చేరువ చేసి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కనిగిరి ఎమ్మెల్యే బుర్రా, జేసీ శ్రీనివాసులు సూచించారు. - 8లో..



జగనన్న ఆరోగ్య సురక్ష ఫైల్ సిద్ధం చేయాలి

జనవరి 1 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి యాక్షన్ ఫైల్‌తో సిద్ధంగా ఉండాలని కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జె.నివాస్ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
29/22

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నేడు సెమీక్రిస్మస్ వేడుకలు

ఒంగోలు: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్లు ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక బచ్చల బాలయ్య కళ్యాణ మండపంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో క్రైస్తవులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని తాము అందించే ప్రేమ విందు స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.

ముక్కోటి ఏకాదశిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

ఒంగోలు: ముక్కోటి ఏకాదశి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజియన్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్ శిద్దా సుధీర్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు శుక్రవారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. జిల్లా ప్రజలు భగవంతుడిని భక్తిశ్రద్ధలతో పూజించి శుభఫలితాలతో పాటు సుఖసంతోషాలు పొందాలని కోరుకుంటూ ముక్కోటి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

నేడు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

మార్కాపురం టౌన్: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటలకు రిజిస్ట్రేషన్, 9 గంటలకు వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం, 9.30 గంటలకు పాఠశాల విద్యార్థుల సందర్శన, 2.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 3.30 గంటలకు ముగింపు, బహుమతుల ప్రదానోత్సవం ఉంటాయని వివరించారు.

సమయం మధ్యాహ్నం మూడున్నర గంటలు.. పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు ప్రాంతంలో అలజడి.. కొమరోలు నుంచి అతివేగంగా వస్తున్న కారు మార్కాపురం వస్తున్న ఆటోను బలంగా ఢీకొట్టింది. ఆటోలోని ప్రయాణికులు చెల్లాచెదురుగా పడిపోయారు. ఏం జరిగిందో తెలుసుకునేలోపే నలుగురు ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి. చికిత్స పొందుతూ మరో ఇద్దరు మృత్యువాత పడ్డారు. మరో ముగ్గురు విద్యార్థులు కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలతో పోరాడుతున్నారు.



మృతదేహాలను పరిశీలిస్తున్న మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి

దూసుకొచ్చిన మృత్యువు

- అతివేగంతో కారు అదుపుతప్పి.. బలంగా ఆటోను ఢీకొని...
- ప్రమాద స్థలంలో నలుగురు దుర్మరణం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో ఇద్దరు మృతి
- తీవ్రగాయాలతో కర్నూలు ఆస్పత్రిలో మరో ముగ్గురు



కారులో నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు మృతదేహాలు





మార్కాపురం వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పెద్దారవీడు/మార్కాపురం: నడిరోడ్డుపై మరణ మృదంగం. అతివేగం ఆరుగురి ప్రాణాలను మింగేసింది. అప్పటి వరకూ శుభకార్యంలో బంధువులతో సంతోషంగా గడిపి ఇంటికి కారులో బయలుదేరిన వారి ప్రాణాలు దారిలోనే గాల్లో కలిసిపోయాయి. క్రిస్మస్ పండుగకు దుస్తులు కొనుక్కునేందుకు మార్కాపురం బయలుదేరిన అన్నదమ్ములిద్దరూ విగతజీవులుగా మారిపోయారు. అప్పటి వరకూ కళాశాలలో పాఠాలు విని ఇంటికి వెళ్తున్న విద్యార్థులు తీవ్రగాయాల పాలై ప్రాణాలతో పోరాడుతున్నారు. ఘటన ప్రదేశానికి మార్కాపురం పట్టణం కేవలం పది కిలోమీటర్లు. అంటే పదిహేను నిమిషాలు ఆగితే ఆటోలో వారి ప్రాణాలు దక్కేవి. ఆటో డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఇక కారులో ఇద్దరు వ్యక్తులు మృత్యువాతపడ్డారు. ఈ హృదయ విదారకర ఘటన అందర్నీ కలచివేసింది. కొమరోలులో బంధువు రాయి వెంకటేశ్వరరావు గృహప్రవేశానికి గుంటూరు చంద్రమౌళినగర్‌కు చెందిన రాయి నాగేశ్వరరావు, రాయి వెంకటేశ్వరరావు, వారి కుటుంబ సభ్యులు రెండు కార్లలో వెళ్లారు. గృహప్రవేశ కార్యక్రమం పూర్తి చేసుకుని మధ్యాహ్నం భోజనం ముగించుకుని సుమారు రెండు గంటల సమయంలో తిరుగు ప్రయాణమయ్యారు. ఒక కారు ముందు వెళుతుండగా రాయి వెంకటేశ్వరావు, నాగేశ్వరరావు ప్రయాణిస్తున్న కారు వెనుక వస్తోంది. సరిగ్గా మధ్యాహ్నం 3.30 నిమిషాలకు పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు వద్ద ఎదురుగా ప్రయాణికులతో వస్తున్న ఆటోను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరూ మృత్యువాత పడ్డారు. ఆటో డ్రైవర్‌తో పాటు మరొకరు దుర్మణం చెందారు.

విద్యార్థుల రోదనలతో...

విద్యార్థుల రోదనలతో మార్కాపురం జిల్లా వైద్యశాల మార్మోగింది. రోడ్డు ప్రమాదంలో గాయపడిన నలుగురిని మార్కాపురం జిల్లా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. వారిలో దోర్నాలకు చెందిన ఉప్పలపాటి డానియేల్ (30), త్రిపురాంతకం మండలం దూపాడుకు చెందిన రత్నతేజ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. రత్నతేజ సోదరుడు అభినయ్ ప్రమాద స్థలంలోనే దుర్మరణం చెందాడు. దుస్తులు కొనుగోలు చేసేందుకు మార్కాపురం బయలుదేరిన అన్నదమ్ములిద్దరూ మృత్యువాతపడడం ఆ ఇంట్లో తీరని విషాదాన్ని నింపింది. దూపాడు గ్రామానికి చెందిన అభినయ్ పెద్దారవీడు మండలం రాజంపల్లి గ్రామ సమీపంలో కేంద్రియ విద్యాలయంలో 7వ తరగతి చదువుతున్నాడు. మార్కాపురం పట్టణ శివారులోని ఒక ప్రైవేటు అగ్రికల్చర్ కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతున్న మైథిలి, రెండో సంవత్సరం చదువుతున్న ముర్షీదా, కమీరూన్‌లది కర్నూలు. వీరంతా కళాశాలలో తరగతులు ముగిసిన అనంతరం మార్కాపురం వెళ్లేందుకు ఆటో ఎక్కారు. ప్రమాదంలో వారికి కాళ్లు, చేతులు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రాథమిక చికిత్స అనంతరం వారిని కర్నూలు ఆస్పత్రికి తరలించారు. కుటుంబానికి ఆధారమైన ఆటో డ్రైవర్ షేక్ బాబు మృతి చెందడంతో అతని భార్య రమీజా, ముగ్గురు ఆడ పిల్లలు గుండెలవిసేలా రోదించడం అందర్నీ కలచివేసింది. ఇదిలా ఉండగా ముందువెళ్తున్న కారులోని వారు వెనుక కారు కనిపించకపోయేసరికి వెతుక్కుంటూ వచ్చారు. ప్రమాదంలో మృత్యువాత పడిన నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావును చూసిన కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఈ నెల 24, 25 తేదీల్లో జిల్లాకు చేరుకుని పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని మాగుంట కార్యాలయ ప్రతినిధి భవనం సుబ్బారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24వ తేదీ ఉదయం 11 గంటలకు స్థానిక సంతపేటలోని రాజమ్మ వైద్యశాల ఆవరణలో జరిగే ఉపాస్ హార్ట్‌కేర్ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. రాత్రి 8.30 గంటలకు ఒంగోలులో జువెట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చిలో క్రిస్మస్ సందర్భంగా నిర్వహించే క్యాండిల్ సర్వీస్ కార్యక్రమంలో పాల్గొంటారు. 25వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక గాంధీరోడ్డులోని గీతా మందిరంలో పొన్నూరు వెంకట శ్రీనివాసులు నిర్వహించే గోదాదేవి తిరుప్పావై ప్రవచన కార్యక్రమంలో పాల్గొంటారు. 9.30 గంటలకు పోతుల చెంచయ్య వర్ధంతి కార్యక్రమంలో పాల్గొంటారు. మిగిలిన సమయంలో స్థానిక తన కార్యాలయంలో ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు.

క్లుప్తంగా

డీసీసీబీ చైర్మన్ల తెలంగాణ పర్యటన



సన్మానం అందుకుంటున్న పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి

ఒంగోలు సిటీ: రాష్ట్ర ఆప్కాబ్ చైర్మన్, 13 జిల్లాల డీసీసీబీల చైర్మన్లు తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ జిల్లాలో పర్యటిస్తున్నారు. అక్కడ బ్యాంక్ అమలు చేస్తున్న అభివృద్ధి పనులు, సాంకేతికపరమైన అంశాలను తెలుసుకున్నారు. శుక్రవారం సుల్తానాబాద్ సంఘాన్ని సందర్శించారు. నాన్ క్రెడిట్ వ్యాపారాలు (సూపర్ మార్కెట్, వాటర్‌బాటిల్ ప్యాకింగ్, ఆర్వో ప్లాంట్, కస్టమర్ సర్వీస్ సెంటర్) సంఘ అభివృద్ధికి ఎలా సహకరిస్తున్నాయో చైర్మన్ శ్రీగిరిశ్రీనివాస్ వివరించారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్, టీఎస్ సీఏబీ చైర్మన్ కొండూరు రవీంద్రను కలిశారు. ఈ సందర్భంగా ఆయన పీడీసీసీబీ చైర్మన్ వై.ఎం.ప్రసాద్‌రెడ్డి(బన్నీ)ని సత్కరించారు.

స్వామిత్వను పూర్తి చేయాలి



సర్వే పురోగతి తెలుసుకుంటున్న డీపీఓ

మద్దిపాడు: స్వామిత్వ కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీరాజ్ శాఖాధికారి నారాయణరెడ్డి సూచించారు. శుక్రవారం మద్దిపాడుతో పాటు గుండ్లాపల్లి సచివాలయాన్ని ఆయన సందర్శించారు. స్వామిత్వ పురోగతిపై సమీక్షించి సంబంధిత టీమ్‌లకు సలహాలు, సూచనలు చేశారు. ఇంటి పన్ను వసూలు, శానిటేషన్‌పై సమీక్ష చేస్తూ గ్రామంలో శానిటేషన్ ప్రక్రియ నిత్యం జరిగేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శిని ఆదేశించారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను పరిశీలించి వర్మీకంపోస్టుపై పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ కార్యాలయ ఏఓ సుబ్బారావు, కార్యదర్శి లతీఫ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ విరించి, డీఏ సాయి, వెల్ఫేర్ అసిస్టెంట్ కిషోర్, సర్వేయర్ శివశంకర్ పాల్గొన్నారు.

దోపిడీ కేసులో నిందితుడికి 6 నెలల జైలు

కనిగిరి రూరల్: దారి దోపిడీ కేసులో నిందితుడికి ఆరు నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి కె.భరత్‌చంద్ర శుక్రవారం తీర్పు వెల్లడించారు. కోర్టు సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. 2015లో సీఎస్‌పురం మండలం రామాపురం సమీపంలో శ్రీరాం శ్రీను, శ్రీరాం నరేష్ అనే వ్యక్తులు గంగారపు వెంకటమ్మ అనే మహిళను చంపుతామని బెదిరించి బంగారు ఆభరణాలు, రూ.4,500 నగదు అపహరించారు. ఆ కేసులో నిందితులపై నేరం రుజువైనందున గతంలోనే శిక్ష విధించారు. అయితే వారు పరారీలో ఉన్నందున శిక్షా కాలాన్ని నిలిపివేసి అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. ఈ క్రమంలో శ్రీరాం శ్రీనును పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా 6 నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. శ్రీరామ్ నరేష్‌ను త్వరలోనే పట్టుకుని కోర్టులో హాజరుపరచాలని పోలీసులను న్యాయమూర్తి ఆదేశించారు.

సమస్యల సత్వర పరిష్కారం

- అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దు
- జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో ఎమ్మెల్యే బుర్రా, జేసీ శ్రీనివాసులు



జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా, జేసీ శ్రీనివాసులు

వెలిగండ్ల: గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పరిపాలనను ప్రజలకు చేరువ చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ప్రజా సమస్యలను కూడా స్థానికంగానే పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రతి మండలంలో జగనన్నకు చెబుదాం పేరుతో ప్రత్యేక స్పందన కార్యక్రమం అమలు చేస్తున్నారని కనిగిరి ఎమ్మెల్యే, ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం బోర్డు సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్, జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. వెలిగండ్ల మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమంలో వారు మాట్లాడారు. స్పందనలో వచ్చిన 130 అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల నుంచి అర్జీల్లో అధిక శాతం గతంలో అసైన్ చేసిన భూములకు శాశ్వత హక్కులు, భూముల అసైన్ నమోదు వంటి అంశాలకు సంబంధించినవేనన్నారు. స్పందన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కంకణంపాడు గ్రామ పంచాయతీలోని గ్రామకంఠం సర్వేనంబర్ 337/2లో 4 సెంట్ల స్థలాన్ని గ్రామంలోని కొందరు ఆక్రమించి రూములు ఏర్పాటు చేశారని జేసీ దృష్టికి స్థానికులు తీసుకొచ్చారు. స్థలాన్ని పరిశీలించి వెంటనే తగు చర్యలు చేపట్టాలని డీఎల్‌పీవో శోభన్‌బాబును జేసీ ఆదేశించారు. రాళ్లపల్లి పంచాయతీ కంద్రిక గ్రామంలో సర్వేనంబర్ 21/1లో 3.29 ఎకరాల్లో రిజిస్ట్రేషన్ భూమిని ఇతరులు ఆక్రమించి ఆన్‌లైన్ చేయించుకున్నారని ముక్కు తిరుపతయ్య జేసీ దృష్టికి తీసుకొచ్చారు. పరిశీలించి న్యాయం చేయాలని తహసీల్దార్ వాసుకు సూచించారు. ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ మాట్లాడుతూ పరిపాలనలో పారదర్శకతకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. జిల్లా యంత్రాంగం కూడా ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. స్పందన కార్యక్రమంలో ఆర్డీవో పాలపర్తి జన్ ఇర్విన్, ఎంపీడీవో తాతపూడి సుకుమార్, తహసీల్దార్ ఎస్.వాసు, ఎంపీపీ రామన మహాలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు గుంటక తిరుపతిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రామన తిరుపతిరెడ్డి, డ్వామా పీడీ శీనారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ తేళ్ల రవికుమార్, డీఎల్‌పీవో శోభన్‌బాబు, టీఆర్ఎస్ ఇ.కొండయ్య, సీపీవో వెంకటేశ్వర్లు, డీఎస్‌వో శ్యాంబాబు, జేడీ ఆర్టీవో పి.రవికుమార్ పాల్గొని అర్జీలు స్వీకరించారు.

ముగిసిన గిరిజన గురుకులాల క్రీడా పోటీలు

- ఓవరాల్ చాంపియన్లుగా యర్రగొండపాలెం, కారంపూడి



ఖోఖో ఆడుతున్న బాలురు

యర్రగొండపాలెం: గిరిజన గురుకుల పాఠశాలల థర్డ్ జోన్ ఆటల పోటీల్లో బాలుర విభాగంలో యర్రగొండపాలెం ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. గత రెండు రోజులుగా స్థానిక గిరిజన గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న పోటీలు శుక్రవారం ముగిశాయి. బాలికల విభాగంలో కారంపూడి పాఠశాల ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. వ్యక్తిగత చాంపియన్లుగా బాలుర గేమ్స్ విభాగంలో ఎస్.మహేష్(యర్రగొండపాలెం), స్పోర్ట్స్‌లో ఇ.మహేష్, బాలికల విభాగంలో టి.హర్షిణి(కారంపూడి) నిలిచారు.

☛ గేమ్స్ బాలుర విభాగంలో వాలీబాల్‌లో పెద్దదోర్నాల, స్వూవర్ట్‌పురం, ఖోఖోలో గిద్దలూరు, కారంపూడి, కబడ్డీలో ఇందుకూరుపేట, సర్వేపల్లి, హ్యాండ్‌బాల్‌లో నాగార్జున సాగర్, కనిగిరి, షటిల్ బ్యాడ్మింటన్‌లో నాగార్జున సాగర్ ప్రథమ, గిద్దలూరు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. ఆర్చరీలో బయ్యన్న(యర్రగొండపాలెం) ప్రథమ, సీహెచ్ ఆవులయ్య(యర్రగొండపాలెం) ద్వితీయ స్థానంలో నిలిచారు.

☛ స్పోర్ట్స్ బాలుర విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో ఇ.మహేష్(చిట్టేడు) ప్రథమ, వి.నాగేంద్రనాయక్(గిద్దలూరు) ద్వితీయ, 200 మీటర్లలో ఇ.మహేష్(చిట్టేడు), ఆర్.శివకుమార్ నాయక్(యర్రగొండపాలెం), 400 మీటర్లలో ఆర్.శివకుమార్‌నాయక్(యర్రగొండపాలెం), ఎ.ముత్యం(చిట్టేడు), 800 మీటర్లలో డి.హనుమానాయక్(గిద్దలూరు), ఎస్.చెంచయ్య(ఇందుకూరుపేట), లాంగ్‌జంప్‌లో ఇ.మహేష్(చిట్టేడు), సునధునాయక్(అద్దంకి), షాట్‌పుట్‌లో సీహెచ్ మధుకుమార్(నాగార్జునసాగర్), కె.వీరయ్య(యర్రగొండపాలెం), డిస్కస్ త్రోలో సీహెచ్ మధుకుమార్(నాగార్జున సాగర్), బి.సాయినాయక్(పెద్దదోర్నాల), ట్రిపుల్ జంప్‌లో ఎం.ఆంజనేయులు, అజాద్(నాగార్జునసాగర్), హైజంప్‌లో కె.వీరయ్య(యర్రగొండపాలెం), ఇ.మహేష్(చిట్టేడు), జావెలిన్ త్రోలో వి.నాగేంద్రనాయక్(గిద్దలూరు), ఆర్.వాసు(చిట్టేడు) వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు.

☛ స్పోర్ట్స్ బాలికల విభాగం వాలీబాల్‌లో వెంకటగిరి ప్రథమ, చీరాల ద్వితీయ, కబడ్డీలో పిడుగురాళ్ల, చీరాల, ఖోఖోలో కారంపూడి, పిడుగురాళ్ల, టెన్నికాయిట్‌లో నాగార్జున సాగర్, నెల్లూరు, చెస్‌లో వినుకొండ, వెంకటగిరి వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. 100, 200 మీటర్ల పరుగు పందెంలో కారంపూడికి చెందిన జె.హర్షిణి, ఆర్.ప్రమీల, 400 మీటర్లలో ఆర్.పవిత్ర, వై.శ్రావంతి, 800 మీటర్లలో బి.గంగోత్రి, ఆర్.పవిత్ర, లాంగ్ జంప్‌లో జె.హర్షిణి(కారంపూడి), ఐ.హారతి(కరేడు), షాట్‌పుట్‌లో ఐ.గీతిక(చీరాల), కె.శ్రీవల్లి(నెల్లూరు) వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారని ప్రిన్సిపాల్ సలాంఖాన్ వివరించారు.

షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక

దర్శి: రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు జిల్లా బాలబాలికల జట్లను ఎన్నుకున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్–19 సెక్రటరీ ఎం.ఆదినారాయణరావు తెలిపారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో శుక్రవారం ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదినారాయణరావు మాట్లాడుతూ జిల్లాలోని పలు కళాశాలల నుంచి 60 మంది బాలురు, 26 మంది బాలికలు పోటీలకు హాజరై ప్రతిభ కనబరిచారని చెప్పారు. ఎంపిక కమిటీ సభ్యులుగా దర్శి కళాశాల పీఈటీ బొడ్డు సుబ్బారావు, వెలుగొండ పీఈటీ ఎస్.చంద్రశేఖర్, గొట్లగట్టు పీడీ బాలగురవయ్య వ్యవహరించారు. బాలుర విభాగంలో దర్శి గురుకుల పాఠశాలకు చెందిన ఐ.అఖిల్, బీ ఎస్కేల్‌బాబు, జీ నాగరాజు, ఎం.రామ్‌చరణ్, పీ అశోక్, పేర్నమిట్ట జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన వై.సంతోష్, ఏ సాయికృష్ణ, గొట్లగట్టు జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఏ సురేంద్ర, ఎస్.శ్రావణ్, ఒంగోలు ఏకేవీకేకి చెందిన డీ బ్రహ్మయ్య ఎంపికయ్యారు. బాలికల విభాగంలో గొట్లగట్టు జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన సీహెచ్‌వీ మహేశ్వరి, జీ శివమణి, జీ చైతన్య, జీ ప్రవల్లిక, ఎం.శ్రీలత, ఎస్.నేహ, వై.త్రివేణి, సీహెచ్ అపర్ణ, ఎం.ప్రసన్న, ఆర్.లక్ష్మీకల్పన ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను దర్శి ప్రిన్సిపాల్ ఎస్.మాధవరావు అభినందించారు.



జిల్లా జట్లకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బైక్‌ను ఢీకొట్టిన మినీ వ్యాన్

- యువకుడు దుర్మరణం, మరొకరికి తీవ్ర గాయాలు
- వ్యాన్ డ్రైవర్ అతివేగమే ప్రమాదానికి కారణం



సంఘటనా స్థలంలో గోపి మృతదేహం



నల్లూరి గోపి(ఫైల్)

చీమకుర్తి: ఎదురుగా వస్తున్న బైక్‌ను అతివేగంగా వెళ్తున్న మినీ వ్యాన్ ఢీకొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృత్యువాత పడగా, అతని స్నేహితుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదం చీమకుర్తి సమీపంలోని టపా చెట్టు వద్ద శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. ముందు వెళ్తున్న వాహనాన్ని మినీ వ్యాన్ ఓవర్ టేక్ చేసే క్రమంలో ప్రమాదం సంభవించింది. మృతుడి బంధువులు, పోలీసుల కథనం మేరకు.. చీమకుర్తి మండలం నిప్పట్లపాడు గ్రామానికి చెందిన నల్లూరి గోపి(29) మర్రిచెట్లపాలేనికి చెందిన షేక్ ఖాసింతో కలిసి బైకుపై ఒంగోలు వెళ్తున్నాడు. ఈ క్రమంలో టపా చెట్టు వద్ద ఎదురుగా వస్తున్న మినీ వ్యాన్ వీరి బైక్‌ను ఢీకొట్టి రోడ్డు పక్కనున్న వాగులోకి దూసుకెళ్లింది. బైకుపై ఉన్న గోపి, ఖాసిం రోడ్డు పక్కన గుట్టల్లో పడిపోయారు. ముఖానికి తీవ్ర గాయాలైన గోపి అక్కడికక్కడే మృతి చెందాడు. ఖాసింకు కాలు విరిగింది. మినీ వ్యాన్ డ్రైవర్ కరీముల్లాకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. గోపి అకాల మరణంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. గోపి తండ్రి నల్లూరి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొండపిలో తప్పిపోయిన 'డాన్'..!

- ఊరంతా తిప్పినా ఫలితం లేక స్టేషన్‌కు తెచ్చి సపర్యలు
- సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం
- తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించిన పోలీసులు



చిన్నారి డాన్‌ను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

కొండపి(సింగరాయకొండ): 'డాన్ తప్పిపోవడమేంటని అనుకుంటున్నారా..?' ఈ డాన్ మీరనుకుంటున్న డాన్ కాదు.. ఐదేళ్ల వయసున్న డాన్ అనే బాలుడు గురువారం సాయంత్రం కొండపి మండల కేంద్రంలో తప్పిపోయాడు. సెంటర్లో ఒంటరిగా దిక్కులు చూస్తున్న బాలుడిని పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు గమనించి చేరదీశారు. ఇల్లు, తల్లిదండ్రుల వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో బాలుడు చెప్పిన విధంగా కొండపి ఊరంతా తిప్పారు. ఫలితం లేకపోవడంతో ఆ బాలుడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. మహిళా కానిస్టేబుల్ భూదేవి బాలుడికి సపర్యలు చేసింది. ఇదిలా ఉండగా బాలుడు పోలీస్ స్టేషన్‌లో క్షేమంగా ఉన్నాడని తెలియజేస్తూ సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. బాలుడి తల్లిదండ్రులు మరియమ్మ, రవి శుక్రవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి కుమారుడిని అక్కున చేర్చుకున్నారు. తమది పొదిలి మండల బుచ్చన్నపాలెం గ్రామమని, కొండపిలో సరుకులు కొనే క్రమంలో డాన్ తప్పిపోయాడని పోలీసులకు రవి వివరించాడు. కుమారుడిని సురక్షితంగా అప్పగించిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ఫైల్ సిద్ధం చేయాలి

- కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ నివాస్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, వైద్యశాఖ అధికారులు

ఒంగోలు టౌన్: జనవరి 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి జిల్లా వైద్యారోగ్య శాఖకు చెందిన అధికారులు యాక్షన్ ఫైల్‌తో సిద్ధంగా ఉండాలని కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జె.నివాస్ ఆదేశించారు. శుక్రవారం ఆయన నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక ప్రకాశం భవన్‌లోని కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజ్యలక్ష్మి, ఇతర వైద్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. నివాస్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షలో స్పెషలిస్టు వైద్యులు కూడా అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. గ్రామాల్లో ప్రతి ఇంటి వద్దకు వెళ్లి వైద్య సేవలు అందించాలని సూచించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి జగనన్న ఆరోగ్య సురక్షలో స్పెషలిస్ట్ వైద్యుడి వద్దకు తీసుకెళ్లి వైద్య సేవలు అందించాలని చెప్పారు. గర్భిణులు తప్పనిసరిగా ప్రభుత్వ వైద్యశాలలో మాత్రమే కాన్పు చేయించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. త్వరలో క్రిస్మస్, సంక్రాంతి పండుగలు జరగనున్న నేపథ్యంలో కోవిడ్ ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా మాస్క్ ధరించాలని, తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. జనావాసాలలో గుమికూడకుండా జాగ్రత్తపడాలని, ఎదుటి వ్యక్తితో మాట్లాడే సమయంలో దూరంగా ఉండాలని తెలిపారు. ఎవరికైనా జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు వస్తే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోగానీ, సర్వజన ఆస్పత్రిలోగానీ చూపించుకోవాలన్నారు.

ఎస్సైగా ఎంపికైన వలంటీర్‌కు సన్మానం



యోగీశ్వరిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కేపీ, చైర్మన్ బాలమురళీకృష్ణ

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని ఎస్సీ బీసీ కాలనీ 6వ సచివాలయంలో వలంటీరుగా సేవలందిస్తూ ఖాళీ సమయంలో ఎస్సై ఉద్యోగానికి సిద్ధమై విజయం సాధించిన వలంటీరు జి.యోగీశ్వరిని శుక్రవారం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ బాలమురళీకృష్ణ ఘనంగా సన్మానించారు. కష్టపడితే మంచి ఉద్యోగం సాధించవచ్చని యోగీశ్వరి నిరూపించిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వలంటీర్‌గా అవకాశం ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సహకారం అందించిన ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, ప్రోత్సహించిన సయ్యద్ అబ్దుల్ ఖాదర్ జిలానీ, బత్తుల లక్ష్మీనారాయణ, సచివాలయ సిబ్బందికి యోగీశ్వరి ధన్యవాదాలు తెలిపారు.

27న వినియోగదారుల హక్కుల దినోత్సవం

- జిల్లా పౌర సరఫరాల అధికారి ఉదయభాస్కర్

ఒంగోలు అర్బన్: ఈ నెల 27వ తేదీన జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి కార్యక్రమాలు ప్రకాశం భవన్‌లోని స్పందన హాల్లో నిర్వహించనున్నట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి ఉదయభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి వినియోగదారులు, స్వచ్ఛంద సంఘాలు, లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు, వివిధ పోటీల్లో విజేతలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఔషధ నియంత్రణ శాఖ, తూనికలు కొలతలు, ఆహారభద్రత, వ్యవసాయ శాఖల స్టాల్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.